# దేవో న జానాతి

గంధం యాజ్ఞవల్క్య శర్మ

**"ఉద్యోగం చేసినంతకాలం రిటైరయ్యాక, రిటైరయ్యాక అన్నారు. రిటైరై మూడు సంవత్సరాలు. ఇప్పుడేమో ఇదిగో, అదిగో అంటున్నారు. ఇక రానున్నది వచ్చేవయసా, పోయేవయసా? ఈ మాత్రపు ఓపికలూ హరించాక, ఇహ తీర్థయాత్రలూ లేవు ... దైవదర్శనాలూ లేవు!" అంటూ మా ఆవిడ సణగ్గా, సణగ్గా బయలుదేరక తప్పింది కాదు దేశ యాత్రలకు.**

అలా బయలుదేరుతూ 'నమశివయ్య'ను, 'వీరభద్రాన్ని', "మీరూ బయలుదేరండ్రా యాత్రలు చేసొద్దాం!" అన్నాను.

నమశివయ్య, వీరభద్రం, నేనూ - ముగ్గురం వీథిబడి నుండి ఈ అరవయ్యో పడి వరకు మిత్రులం. పక్కనున్న పల్లెటూరు నుండి విజయవాడ చేరి గత నలభయ్యేళ్లుగా మా మా జీవనవ్యాపకాలతో జీవితాలను వెళ్లతీస్తున్న వాళ్లం. నేను కాలేజీలెక్చరరు గానూ, నమశివయ్య వంశపారంపర్యంగా వస్తోన్న ఆయుర్వేదంలో ఆర్.ఎం.పి. సర్టిఫికెట్ తీసుకుని మునిసిపాలిటీలో డాక్టరుగానూ ఉద్యోగాలు చేసి రిటైరు కాగా, వీరభద్రం మాత్రం పూర్వీకుల నుండి సంక్రమించిన ఆస్తిపాస్తులను వ్యాపారాలు, కాంట్రాక్టులు చేసి వాటిని పదింతలుగా పెంచి ఇప్పుడు వాటిపై వచ్చే ఆదాయాలపై కాలం గడుపుతున్నాడు.


యాత్రలు చేసొద్దాం అనే నా ప్రతిపాదనకు నమశివయ్య - "అరేయ్ శంకరం! రిటైరైనా, ఇంకా నా బాధ్యతలు నన్ను చుట్టుముట్టే ఉన్నాయి కదా! ఆ డిస్పెన్సరీ వదలిరావటానికి నా కెలా కుదురుతుంది చెప్పు?" అన్నాడు.

నిజమే మరి!

రిటైరయ్యాక తన ఇంటి ముందరి గదినే డిస్పెన్సరీగా మార్చుకుని వైద్యం చేసుకొని నాలుగురాళ్లు సంపాదించుకుంటున్నాడు. నలుగురి ఆడపిల్లలలో, పై ముగ్గురిని అత్తారిళ్లకు పంపగా, ఇకా ఆ కడగొట్టుది పెళ్లికెదిగి వాడి గుండెల మీదుంది కుంపటిలా.

నమశివయ్య అలా తన నిస్సహాయతను ప్రకటిస్తే, వీరభద్రం -

"అరేయ్! భగవంతుడు జీవుల లాభనష్టాల గణితాన్ని ఎంత విచిత్రంగా సరిపెడతాడో చూడు! నాకు సంపద అనే లాభాన్ని చూపెట్టి, దానికి అనారోగ్యం అనే నష్టాన్ని కలిపి, నా బాలెన్సుషీట్‌ను సరిపెట్టేశాడు. గతమంతా ఆహార నిద్రలు మాని గడించాను. లంకంత ఈ కొంప కట్టించాను. బాంకుబాలెన్సు, షేరు సర్టిఫికెట్స్, ద్రాక్షతోటలు...ఇంకా...ఇంకా...ఎందుకివ్వన్నీ...ఇంత



తృప్తిగా తినటానికి లేదు, అనుభవించటానికి లేదు. అంతా నన్ను అదృష్టవంతుడు, అదృష్టవంతుడు అంటారు. ఏమిట్రా అదృష్టం? కనీసం ఇంత తీర్థయాత్రలకైనా కదలలేని జీవితం!" అంటూ నిట్టూర్చాడు.

అదీ నిజమే మరి.

వీరభద్రానికి సంతానం లేదు. వాడికి బి.పి., షుగర్. వాళ్లావిడ దుర్గమ్మకు ఈ రెండింటితోపాటు ఆర్థరైటీసు. మంచంలోనుండి కదలలేదు. అంత పెద్ద భవనం - 'దుర్గాసదన్'లో ఒంటరిగా వాళ్లిద్దరు.

"అయితే వెళ్లొస్తాను!" అన్నాను.

"వెళ్లిరారా! సంపాదించి పెడుతున్న కొడుకు, పువ్వులలో పెట్టి చూచుకునే కోడలు. నీకేంరా, ఎక్కడికైనా వెళ్లగలవు!" అన్నాడు నమశివయ్య.

వాడిమాటల్లో ఉంది ఈర్ష్య, అసూయలు కావు. నా అదృష్టం పట్ల ఆత్మానందం, సంతృప్తినూ.

వీరభద్రం - "మిమ్మల్ని చూస్తుంటే ఈర్ష్యగా ఉందిరా, శంకరం! భగవంతుడు మీకు చక్కని ఆరోగ్యాన్నిచ్చాడు. మరింతకంటే మహాభాగ్యాలేం కావాలి కనక?" అన్నాడు.

వాడిదీ ఈర్ష్య కాదు. వాత్సల్యం లాలూకు ప్రతిస్పందనే.

నమశివయ్య, వీరభద్రం నన్నూ, మా ఆవిణ్ణి రైలెక్కించి వీడ్కోలు చెప్పారు.

దగ్గర దగ్గర నెలరోజులపాటు, ఉత్తరదేశంలోని యాత్రాస్థలాలన్నీ దర్శించాము. తీర్థాలన్నీ సేవించాము. వారణాసిలో గంగాస్నానం చేసి విశ్వేశ్వరుణ్ణి దర్శించాము. మనస్సు ఉద్విగ్నమైంది. సారనాథ్‌లో ఆ బుద్ధమూర్తి వదనంలోని ప్రశాంతత చూసి, నిర్నినిమేషులమయ్యాం. త్రివేణి సంగమ దృశ్యం మమ్మల్ని వివశుల్ని చేసింది.

బదరి, పంచవటులను దర్శించి, హిమాలయ సానువులను చేరుకున్నాము. అక్కడి వాయులింగాన్ని చూచాక, ఈ చరాచర జగత్తుకు ఆధారభూతమైన వాయురూపాన్ని దర్శించినట్లైంది.

ఆ అంబర చుంబిత హిమవన్నగాలు - ఆ సూర్యోదయ అస్తమయాలు, ఆ పర్జన్యశోభిత వర్షధారలు, ఆ జలపాతాలూ మమ్మల్ని పరవశింపచేశాయి. ప్రకృతి అంతా తానేఅయి, తానే ప్రకృతై, ఆ లీలామానుషమూర్తి కల్పిస్తున్న మాయ ఇదంతా అనిపించింది.

నెలరోజులకు యాత్రలు ముగించుకుని తిరిగి వచ్చాం.

"గత పదిరోజులుగా నమశివయ్యగారు, మీరు తిరిగి వచ్చారా అని వాకబు మీద వాకబు చేస్తున్నారు!" అని చెప్పింది మా కోడలు రమ.

"ఏమిటట?"

"ఏమిటో మరి, రోజూ వాళ్ల కాంపౌండరు వాకబుచేసి వెళ్లేవాడు. మరీ, నిన్నా, ఈ రోజూ అయితే ఆయనగారే వచ్చి వెళ్లారు."

"ఏమై వుండొచ్చబ్బా?" అని ఆలోచనలో పడిపోయాను. అంతలో రానే వచ్చాడు నమశివయ్య హడావుడిగా. వస్తూనే -

"నీ రాకకోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నాను!" అన్నాడు.

"ఏమిటీ?"

"మన వీరభద్రానికి ఆరోగ్యం ఏమీ బాగాలేనట్లు తెలుస్తోంది."

"అదేమిటి - వీరభద్రం ఆరోగ్యం బాగాలేనట్లు తెలియటమేమిటి? నీవే కదా వాడి డాక్టరివి?"

నా ప్రశ్నపట్ల దిగాలుపడ్డట్లుగా చూసి, "వాడి ఇంట్లో పరిస్థితులు మారి పోయాయి. వాణ్ణి చూడటం నాకు సాధ్యం కాలేదు" అన్నాడు నమశివయ్య.

"ఏం?"

"అక్కడికి ఏవరినీ రానివ్వటంలేదు. చివరికి మనలాంటి ఆప్తమిత్రులను కూడా."



నమశివయ్య అంటున్నదేమిటో నాకర్థం కాలేదు.

"వీరభద్రం ఇంటికి వెళ్లటానికి నీకు ఒకరి అనుమతి కావలసి రావటమేమిటిరా?" అన్నాను.

విపులంగా చెపుతా విను -

"ఆనాడు మిమ్ములనలా తీర్థయాత్రలకు రైలెక్కించామా, అక్కడే రైలుస్టేషన్‌లోనే వీరభద్రం 'కొంచెం తల తిరుగుతోంది' అన్నాడు. వాడి కారులోనే మా డిస్పెన్సరీకి వెళ్లి బి.పి. చూశాను. ఏమంత ఎక్కువేం లేదు. ప్రత్యేకంగా మందులేం అక్కరలేదు, మామూలుగా వేసికొనేవే వేసికొని విశ్రాంతి తీసుకో. అవసరమనుకుంటే మీ నౌకరు రాములుతో కబురెట్టు - అని చెప్పి పంపేశాను.

మళ్లీ కబురేం రాలేదు. తగ్గి ఉంటుందనుకున్నాను. ఆ రోజే మా పెద్దమ్మాయి, పిల్లలు వచ్చారు. ఆ మరునాడే మా మూడవది, అల్లుడు వచ్చారు. ఆ హడావుడిలో పడిపోయి వీరభద్రం ఇంటికి వెళ్లటం పడింది కాదు నాకు.

"ఓ వారం రోజులకనుకుంటాను వీరభద్రం నౌకరురాములు నా దగ్గర కొచ్చాడు. వీరభద్రం ఆరోగ్యమెలా ఉందీ వాకబు చేశాను.

"అయితే, మీరూ ఎల్లటంలేదా బాబూ ఆరింటికి?" అని ఎదురుప్రశ్న వేశాడు. రాములు ప్రశ్నలో ఏదో ధ్వనించినట్లై - "ఏం నీవు వెళ్లటం లేదా?" అని అడిగాను.

"నన్ను పని మాన్పించేశారు కదండీ!" అన్నాడు.

ఆశ్చర్యపోయాను. నాకు తెలిసి రాములు ఇరవయ్యేళ్లపైనుండి వీరభద్రం వద్ద పనిచేస్తున్నాడు. పైగా వీరభద్రానికి నమ్మినబంటు కూడా.

"వీరభద్రం నిన్ను పని మాన్పించేశాడా?"

"అయ్యో! ఆరు కాదండి బాబూ! ఆరికి తెలిస్తే అట్టా ఎట్టా జరుగుద్దండీ? ఆరి బావమరిదిగారు, దుష్యంతరావుగారండి. అసలేం జరిగిందంటేనండీ ..." అంటూ రాములు జరిగిందంతా చెప్పాడు!" అన్నాడు నమశివయ్య.

"ఏం జరిగిందట?" ప్రశ్నించాను.

"నెలరోజులయిందట.... అదే మీరు యాత్రలకని బయలుదేరారు చూడు - అంతకుముందు రెండు మూడు రోజులకు ముందు, దుష్యంతరావు భార్యతో సహా దిగిపోయేడట వీరభద్రం ఇంటికి - 'ఇహ, అక్కా, బావగార్లను కనిపెట్టుకుని ఉండిపోతానంటూ'. ఆ రోజు మిమ్మల్ని రైలెక్కించి, తిరిగి ఇంటికెళ్లాక వీరభద్రం సరాసరి తన గదిలోకి వెళ్లి పడుకునిపోయేట్ట సాయంత్రం వరకు. సాయంత్రం రాముల్ని పిలిచి, 'నాకు బి.పి. ఎక్కువగా ఉంది, వెళ్లి నమశివయ్యను పిలుచుకుని రా!' అని చెప్పాట్ట. బయలుదేరిన రాముల్ని బయట గేటు వద్ద ఆపి -

'నీవు కాదులే ఉండు,' అని దుష్యంతరావే కారేసుకుని వెళ్లి ఎవరో కొత్త డాక్టర్ని పిలుచుకుని వచ్చేడట. రాముల్ని గేటు వద్ద ఆ ఆపటం, ఆపటం, అంటే, మళ్లీ ఆ ఇంటి గుమ్మం దాటి లోనికి వెళ్లనీయలేదట. మర్నాడు నీ నౌకరీ అక్కర్లేదు వెళ్లిపొమ్మన్నాడట.

## బహుధాన్యా

ఆగచ్ఛతి మహాప్రీత్యా
బహుధాన్యా ధరాందివః
బహుధాన్యాని లోకేస్యుః
బహుధాన్యాశ్చ సంపదః

కర్షకస్య శుభం భూయాత్
సస్యాని పుష్కలాని చ
నో భూయాదాత్మహత్యాతు
కర్షకస్య చ సర్వదా

సత్యాగమః ప్రవర్ధేత
ప్రరోహేత్ ధర్మవల్లికా
భుంజీరన్ మానవా నిత్యం
సత్య ధర్మఫలాని చ

భూపాలన మహాయజ్ఞే
భవేదృత్విక్ కృషీవలః
ధాత్రీపాలన యంత్రాంగే
భవేచ్ఛక్తిః కృషీవలః

బహుధాన్యా సమాయాతి
సర్వం భవతు పుష్కలం
శాంతి సస్యాని వర్ధేరన్
హింసామారీ వినశ్యతు.

**కనమలూరు వెంకటశివయ్య**

రాములు నిర్ఘాంతపోయి - 'అయ్యగారితో, ఒక్కసారి మాట్టాడి ఎళతా బాబూ!' అని వేడుకున్నా, "వీల్లేదు అయ్యగారికి ఎక్కువగా ఉంది. మన స్పృహలో లేరు. ఎవరూ చూడటానికి వీల్లేదని డాక్టరుగారు చెప్పారు!" అంటూ, కనీసం అమ్మగారిని చూస్తానన్నా ఒప్పుకోక పంపించేశాడట.

నా కంతా అయోమయంగా ఉంది. ఏడుపొచ్చింది. 'ఏం చేత్తానండీ!ఒచ్చేశా... నా పేణమంతా అయ్యగారిమీదే ఉంది' అంటూ కన్నీళ్లెట్టుకున్నాడు రాములు."

చెప్పటం ముగించాడు నమశివయ్య.

దుష్యంతరావు పేరు వినగానే కీడు శంకించింది నా మనస్సు. దుష్యంతరావు నాకు తెలుసు. వీరభద్రం భార్య దుర్గమ్మకు పినతండ్రి కొడుకు. చిన్నతనానే తల్లిదండ్రులు పోతే, దుర్గమ్మ తండ్రే పెంచి పెద్దచేసి ఉద్యోగమిప్పించాడట. కోర్టులో గుమాస్తా చేస్తూ, డిపాజిట్టయిన స్టొలెన్ ప్రాపర్టీని అమ్ముకున్న నేరంపై ఉద్యోగం నుండి డిస్మిస్ అయ్యాడని వీరభద్రం చెప్పినట్లు గుర్తు. నొష్టనొక కాల్చిన మచ్చ, వెనక్కి దువ్విన(క్రాఫ్, ఎర్రటికళ్లు, లాల్చి, పైజమా ధరించి ఎప్పుడూ నోటిలో కారాకిళ్లీతో కనిపించేవాడు వీరభద్రం ఇంటిలో అప్పుడప్పుడు.

"మరి నీవేం చేశావు?" ప్రశ్నించాను నమశివయ్యను.

'వీరభద్రం ఇంటికి వెళ్లాను. ఎవరెవరో, అంతా కొత్తనౌకర్లు కనిపించారు.'

"మీరెవరు?" అంటూ నన్ను ప్రశ్నించి అడ్డగించారు.

"వీరభద్రంగారి స్నేహితుణ్ణి. ఆయన్ని చూడాలి!" అన్నాను.

"వీల్లేదు!" అన్నారు.

కాదు వెళ్లి చూడవలసిందే అని పట్టుపట్టాను. చివరికి దుష్యంతరావు వచ్చాడు. తనకు నేనెవరినో తెలియనట్లే ప్రవర్తించాడు.

"బావగారి ఆరోగ్యం బాగాలేదు. ఆయనగారిని ఎవరూ డిస్టబ్ చేయరాదని డాక్టరుగారు చెప్పారు!" అన్నాడు.

"నేనేం వాణ్ణి డిస్టబ్ చేయను, చూసి వెళతాను!" అన్నాను.

"వీల్లేదు, వెళ్లిపొండి!" అన్నాడు.

"నాకు దుఃఖం వచ్చింది. నలభయియేళ్లుగా ఆ ఇల్లు మనదనుకున్నాం. నిస్సహాయంగా తిరిగి వచ్చేశాను. ఆనాటినుండి నీ రాక కోసం ఎదురు చూస్తున్నాను!" అన్నాడు.

మళ్లీ నమశివయ్యే - "ఆ కొత్తడాక్టరెవ్వరో ఆరా తీశాను. గణేశన్ అని - వాడు క్వాలిఫైడ్ డాక్టరు కాదు. ఎవరో 'క్వాక్' డాక్టరు. వీరభద్రానికి స్లోపాయిజన్ లాంటివేమైనా ఇస్తున్నాడేమో అని నా అనుమానం. వీరభద్రం ఆస్తిపాస్తులను హరించటానికి దుష్యంతరావు పన్నుగడేమో ఇదంతా!" అన్నాడు.

నా దేశయాత్రలో నెలరోజులుగా ఆర్జించుకున్న ప్రశాంతత అంతా క్షణంలో మాయమైపోయింది. ఎనలేని కోపం పెల్లుబికింది దుష్యంతరావుపై.

"వీడెవడ్రా మనలను అడ్డుకోవటానికి ...పద దుష్యంతరావు సంగతేమిటో తేల్చేద్దాం!" అంటూ వీరభద్రం ఇంటికి బయలుదేరాను నమశివయ్యతో సహా.

మమ్మల్ని దుర్గాసదన్ ముందు గేటు వద్దనున్న కొత్త ఘూర్ఖా ఆపటానికి ప్రయత్నించాడు. దబాయించి లోపలకు నెట్టుకుని వెళ్లాం.

ఇంటి ముఖద్వారం వద్ద పడకకుర్చీలో బైఠాయించి ఉన్న దుష్యంతరావు లోపలికి నెట్టుకుని వస్తున్న మమ్ము అడ్డుకున్నాడు.

"మేము వీరభద్రానికి చూడాలి!" అన్నాను.

"వీల్లేదు, మర్యాదగా బయటకు పొండి!" అన్నాడు.

"నీవెవడివి మమ్మల్ని కాదనటానికి?" అంటూ ముందుకు వెళ్లటానికి ప్రయత్నించాను.

"నేనెవరినో మీకు చెప్పవలసిన పని లేదు. మంచిగా బయటికి పొండి. లేకుంటే..." అంటూ చప్పట్లు చరిచాడు. ఎటునుండి వచ్చారో, బిలబిలమంటూ పోతుల్లాంటి వాళ్లు అరడజనుమంది వచ్చి, దుష్యంతరావు పక్కన నిలుచున్నారు.

పరిస్థితిని అంచనా వేసి వెనక్కిరాక తప్పింది కాదు.

అలా తిరిగి వస్తున్న మాతో, దుష్యంతరావు - "మా వీరభద్రం బావగారు, తమ యావదాస్తులపైనా ఉత్తరాధికారిగా నాకు సర్వహక్కులూ కల్పిస్తూ వీలునామా రాశారు!" అన్నాడు.

"ఏ స్పృహలేని స్థితిలోనో వీడు వీరభద్రం సంతకం చేయించుకునే ఉంటాడు!" అన్నాడు నమశివయ్య.

ఏం చేయాలో తోచింది కాదు. ఆవేశమే కానీ, ఆలోచనలు లుప్తమైన మాతో - "అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రఘు మీ స్టూడెంటేగా! ఓసారి ఆయనతో మాట్లాడితేనో ..!" అంది మా కోడలు.

అవును. వెంటనే రఘుకు ఫోను చేశాను. ఆఫీసులో లేడు. ఇంటిలోనూ లేడు. ఏదో అర్జంటు కేసు దర్యాప్తులో గుంటూరువెళ్లాడని, రాత్రి పది గంటలకు రావచ్చని చెప్పింది వాళ్లావిడ.

ఆ రాత్రికి నమశివయ్య మా ఇంటిలోనే ఉండిపోయాడు. వీరభద్రానికి గురించిన ఆందోళన

ముసురులా కమ్ముకుంది మమ్మల్ని. రఘుకోసం మధ్య మధ్య ఫోనులు చేస్తూనే ఉన్నాం వాళ్లింటికి.

రాత్రి పన్నెండు దాటాక అప్పుడే గుంటూరు నుండి తిరిగి వచ్చిన రఘు - "ఏమిటి మాస్టారూ?" అంటూ ఫోను చేశాడు.

విషయం క్లుప్తంగా చెప్పాను.

"వస్తున్నానుండండి!" అని రఘు తన జీపులో మాఇంటికి వచ్చాడు పావు గంటలో.

అంతా విని, మా ఫోనులోనే వీరభద్రం ఇంటి ఏరియా పోలీస్‌స్టేషన్ ఇన్ స్పెక్టర్ని పిలిచి,

"వెంటనే అయోధ్యానగర్ రెండవవీథిలోని దుర్గాసదన్ వద్దకు మఫ్టీలో ఓ ఒక కానిస్టేబులును పంపు. అతనక్కడ ఉంచి ఆ ఇంటిలోనికి వచ్చిపోయేవారి పై నిఘా ఉంచమను. నీవు డాక్టరుగా చెలామణి అవుతున్న గణేశన్ అనే వ్యక్తిని గురించి వాకబు చెయ్! అతడు మీ ఏరియాలోనే సుఖవ్యాధుల డాక్టరట. ప్లీజ్, మువ్ ఫాస్ట్!" అని చెప్పాడు.

"రఘూ! ఏం చేస్తావో, ఎలా చేస్తావో ... వీరభద్రాన్ని ఆ దుష్యంతరావు పంజా నుండి కాపాడు!" అన్నాను.

"మీరేం కంగారుపడకండి, మాస్టారూ! నేను మా బలగంతో తెల్లవారుజామున అయిదుగంటలకల్లా వస్తాను. మీరూ రండి. ఆ ఇంటిపై రైడ్ చేసి దుష్యంతరావును సాక్ష్యాధారాలతో పట్టుకుంటాను!" అన్నాడు రఘు.

రఘు వెళ్లాక కొంత తేలికపడిన మనసులతో నేనూ, నమశివయ్య వీరభద్రం విషయాలే మాట్లాడుకుంటూ ఉండిపోయాము. నిద్రపట్టింది కాదు మాకు.

తెల్లవారుజామున నాలుగు గంటలయిందనుకుంటాను. రఘు నుండి ఫోను వచ్చింది.

"మాస్టారూ! ఇప్పుడే దుర్గాసదన్ వద్ద ఉన్న మా కానిస్టేబుల్ నుండి ఒక మెసేజ్ వచ్చింది. ఆ గేటుముందుంటే ఘుర్కాతో లోపలినుండి వచ్చిన నౌకరు 'అయ్యగారు చనిపోయారు. డాక్టరుకి ఫోను చేశాం. అయన వస్తారు. తలుపు తెరిచివుంచు!' అని చెపుతున్నాడట. నేనా ఏరియాఇన్‌స్పెక్టర్‌కి దుష్యంత రావును కస్టడీలోకి తీసుకోమని, ఇప్పుడే ఫోనులో చెప్పాను. నేనొస్తున్నాను. మీరు రెడీగా ఉండండి. మనం అక్కడికి వెళదాం!" అన్నాడు రఘు.

ఆ వార్త వింటూనే, "అరేయ్ వీరభద్రం ... వెళ్లిపోయావట్రా ..!" అంటూ కూలిపోయాను.

నమశివయ్య, మా ఆవిడ, కోడలు రమ నా చుట్టూ మూగారు. అంతలోనే తన కారులో వచ్చాడు రఘు. 'నేనక్కడకు రాలేను, నాయినా! నే నా దృశ్యాన్ని చూడలేను. నాయనా రఘూ! ఆ దుర్మార్గుణ్ణి ... దుష్యంతరావును, బంధించి వీరభద్రం మరణానికి ప్రతీకారం, చెయ్!" అన్నాను.

"నేనొస్తానక్కడికి!" అని నమశివయ్య బయలుదేరాడు రఘుతో.

అంతలోనే, బయట జీపు వచ్చి, ఆగిన శబ్దమయింది. అందులోనుండి ఇన్‌స్పెక్టరు దిగి వచ్చి రఘుకు శాల్యూట్ చేశాడు.

"దుష్యంతరావును కస్టడీలోకి తీసుకున్నావా?" ప్రశ్నించాడు రఘు.

"సర్, ఆ పని చేయలేకపోయాను."

"వై?" చిరాగ్గా గద్దించాడు రఘు.

"క్షమించాలి ... చనిపోయింది వీరభద్రంగారు కాదు, దుష్యంతరావు ... మాసివ్ హార్ట్ ఎటాక్!"

■


నూతన తెలుగు సంవత్సర శుభాకాంక్షలతో



మీ శ్రేయోభిలాషి ఆర్.వి. రాజు

నెల్లూరు పట్టణమునకు అతి సమీపములోకృష్ణాపట్నం పోర్టు సిటీ రోడ్డుకు ఆనుకొని ఉన్న బాబానగర్ లో కొద్ది పాట్లు మాత్రమే ఉన్నవి. డి.టి.పి. అప్రూవల్ లేఅవుట్, విశాలమైన రోడ్లు, రోడ్డు కిరువైపుల చెట్లు, డ్రైనేజ్, కరెంట్, వగైరా అన్ని ప్రాథమిక వసతులతో అలరారుచున్న మన బాబానగర్ లో ప్లాటు కొరకు త్వరపడండి. కొన్ని ఇండ్లు కూడా ప్రారంభించి కట్టుబడి చేయబడుచున్నవి. వెంటనే అడ్వాన్సు చెల్లించి ప్లాటు రిజర్వు చేసుకొనగలరు.

పై 'బాబానగర్' ప్లాటు కొరకు మాతో సంప్రదించండి.

RVR ESTATES

**R.V.R. ESTATES** Ph: 327385
Main Road, Ramalingapuram,
NELLORE - 3

**RAJU HARD WARE & PAINTS** Ph: 328915
Near R.T.C. Bus Stand, Main Road,
NELLORE - 3